

కొవ్వూరు కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా సి.హెచ్.వెంకటేశ్వర్లు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసే కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సస్పెండ్ కావడంతో ఎఇ జి.సందీప్ ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించారు. నూతన కమిషనర్ వెంకటేశ్వర్లు గతంలో 8 చోట్ల కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. గడిచిన 30 ఏళ్ల కాలంలో పురపాలక శాఖలో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో సీనియర్ కమిషనర్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లుకు కార్యాలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బతుకులు బుగ్గిపాలు

- బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం
- ఆరుగురు సజీవ దహనం,
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ఘటన

వారంతా రోజువారీ కూలీలు. కుటుంబ పోషణ నిమిత్తం ఊరుగాని ఊరొచ్చి పనులు చేసుకుంటున్నారు. దీపావళి కావడంతో బాణసంచా తయారీ కేంద్రాల్లో కూలీలుగా మారారు. కష్టపడి పనిచేసి ఈ దీపావళికి తమ పిల్లల కళ్లల్లో వెలుగులు నింపాలనుకున్నారు. కాని అనుకోని ప్రమాదం వారి ఇంట చీకట్లను నింపింది. బతుకులను బుగ్గిపాలు చేసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరో నలుగురు ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్నారు.



దగ్ధమవతున్న యూనిట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాయవరం మండలం కొమరిపాలెం గ్రామంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ యూనిట్‌ను వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి నిర్వహిస్తున్నారు. దీపావళి సమయం దగ్గరపడటంతో బాణ సంచా పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నారు. స్థానికులతో పాటు అనపర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలు ఈ యూనిట్‌లో రోజువారీ కూలికి పని చేస్తున్నారు. బుధవారం ఎప్పటిలానే యజమాని సత్యనారాయణమూర్తితో పాటూ వివిధ ప్రాంతాలకు చెందిన మరో 9 మంది కూలీలు ఈ యూనిట్‌లో బాణ సంచాతయారీలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం సమయంలో ఈ యూనిట్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. క్షణాల్లోనే దట్టమైన పొగ కమ్మి మంటలు చెలరేగాయి. భారీ పేలుడుకు గోడ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. వీరిలో ఫైర్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి(65), కూలీలు రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన పాకా అరుణ(35), అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల(35), అనపర్తి సావరం గ్రామానికి చెందిన కుడిపూడి జ్యోతి(38), పెంకే శేషారత్నం(40) మృతదేహాలను గుర్తించారు. మరొకరిని గుర్తించాల్సి ఉంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొమరిపాలెంకు చెందిన పొట్నూరి వెంకటరమణ, పెదపూడి మండలం వేండ్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ, అనపర్తికి చెందిన చిట్టూరి యామిని, సోమేశ్వరానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో, ఒకరు ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



కాలిపోయిన మృతదేహాలు

గుర్తుపట్టలేనంతగా...

ఈ ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. ప్రమాదం జరిగిన ఐదారు గంటల వరకూ మృతదేహాలను గుర్తించలేకపోయారు. మరో మృతదేహం పూర్తిగా కాలిపోవడంతో గుర్తుపట్టడం కష్టంగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన వారు కావడంతో వారి ఆచూకీలను తెలుసుకోవడం కూడా పోలీసులకు కష్టమైంది. ప్రమాదం విషయం ఛానల్లు, సోషల్ మీడియాలో రావడంతో బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గుర్తుపట్ట లేనంతగా తమవారు కాలిపోవడంతో గుండెలవిసేలా రోదించారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన హోం మంత్రి

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాయవరంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనా ప్రాంతాన్ని బుధవారం రాత్రి సందర్శించారు. కాకినాడలోని సామర్లకోటకు విచ్చేసిన ఆమె అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా రాయవరంలో ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్‌పి రాహుల్‌మీనాలతో మాట్లాడారు. ప్రమాదానికి కారణాలపై ఆరాతీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఆమె వెంట అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఉన్నారు.

సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

బాణసంచా పేలుడు ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో ఆయన మాట్లాడారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారనాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, క్షతగాత్రులకు వైద్య సాయం వంటి విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఫుడ్ కమిషన్ సభ్యుల తనిఖీలు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని బుధవారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ లక్ష్మీరెడ్డి పలు పాఠశాలలు, రేషన్ షాపులు, వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోకవరంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. నేరుగా విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కూరలు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఇవ్వడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గుమ్మల్లదొడ్డిలో రేషన్ దుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి బియ్యం నాణ్యత, కోడిగుడ్ల బరువు, ఆహార పదార్థాల పంపిణీ విధానాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి శుభ్రత, పిల్లలకు అందించే ఆహార రికార్డుల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఒ బి.శ్రీనివాస్, బి.శశాంక్, డిఎం గణేష్ కుమార్, ఎఎస్‌ఒ ఎం.నాగాంజనేయులు, ఎజి రంగ ప్రసాద్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుప్రియ, ఐసిడిఎస్, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌కమిషన్ సభ్యులు

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ఈర్పిన సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఉండ్రాజవరం వెలుగు కార్యాలయంలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు, పిఎసిఎస్, గ్రామ సిబ్బంది ప్రతి ఒక్కరూ అవగాహనతో వ్యవహరించి, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. తేమశాతం కొలిచే యంత్రాలలో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని, అన్నింటిలో ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. గోనె సంచుల విషయంలో జవాబుదారీతనం ఉండాలన్నారు. మండలంలో పండించిన ధాన్యాన్ని సాధ్యమైనంత వరకు మండలంలోని రైసు మిల్లులకే వచ్చేలా చూడాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో మండల రైతు సేవా కేంద్రాలకు గోనె సంచులు ఇవ్వడంలో, తడిసిన ధాన్యాన్ని తీసుకోవడంలో రైస్ మిల్లర్ల నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. తహశీల్దార్ మాట్లాడుతూ వివిధ శాఖలు, స్థాయిల సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో రైతుకు ఎటువంటి కష్టాలు, నష్టాలు కలుగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. పరస్పర అవగాహనతో అవకతవకలు లేకుండా ధాన్యం కొనుగోలు కార్యక్రమం సజావుగా నిర్వహించవచ్చన్నారు. గోనె సంచుల నాణ్యతను రైతులకు పంపిణీ చేసే ముందే పరిశీలించాలన్నారు. వర్షాలు, తుపాన్లు వంటి ప్రకతి వైపరీత్యాలు వచ్చినా తట్టుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. టార్పాలిన్స్‌ను ప్రతి సొసైటీలో ముందస్తుగానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొవ్వూరు ఎడిఎ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా రైతులకు వాట్సాప్ ద్వారా షెడ్యూలింగ్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి, ధాన్యం నమూనాలను సేకరించి, తేమ శాతం ప్రభుత్వ నాణ్యత నిబంధనల మేరకు ఉన్న రైతులకు మాత్రమే గోనె సంచులు ఇవ్వాలన్నారు. జిపిఎస్ ఉన్న వాహనాల ద్వారానే ధాన్యాన్ని మిల్లుకు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.చంద్రశేఖర్, ఎంపిడిఒ మడిపల్లి శ్రీనివాసరావు, ఎఒ వివివిఎస్.రామారావు, వ్యవసాయాధికారి బి.రాజారావు, సిఎస్‌డిటి సుధాకర్, సొసైటీ సిఇఒలు, టిఎలు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఊనగట్ల జడ్‌పి హైస్కూల్‌లో క్రీడా విద్యార్థులకు పూర్వ విద్యార్థి కె.సురేష్‌కుమార్ రూ.12వేల విలువ చేసే 21 జతల క్రీడా దుస్తులను అందించారని వ్యాయామ ఉపాధ్యాయులు కొయ్య గంగాధరరావు, ప్రధానోపాధ్యాయులు ఎన్‌వి.రమణ తెలిపారు. ఆయన గతంలోనూ రూ.20వేల విలువ చేసే క్రీడా దుస్తులు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నందిగం శ్రీనివాస్ ఎస్‌ఎంసి ఛైర్మన్ శివసురేష్‌కుమార్‌ను జ్ఞాపిక అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

జిఎస్‌టిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు వాణిజ్య, అర్థశాస్త్ర శాఖల ఆధ్వర్యంలో జిఎస్‌టి 2.0పై అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర అధ్యక్షత వహించారు. వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జిఎస్‌టి 2.0 ద్వారా ప్రభుత్వం చేసిన సంస్కరణలను వివరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గృహ, వ్యవసాయ, విద్యా, నిర్మాణ అవసరాలపైన, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, బీమా సదుపాయాలపై జిఎస్‌టి తగ్గింపుతో కలిగే లాభాలను వివరించారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి జిఎస్‌టి 2.0 ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగ అధిపతి డాక్టర్ పివివి.సత్యనా రాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మందులపై పన్ను రద్దుతో ఊరట : జెసి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0 సంస్కరణలు ప్రజల ఆరోగ్యానికి, కుటుంబ భద్రతకు మేలుచేసే క్రమంలో అందుబాటు ధరల్లో మందులు, వైద్య సేవలు నిలుస్తున్నాయని జిఎస్‌టి జిల్లా నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు నేరుగా లాభం చేకూర్చే విధంగా జిఎస్‌టి 2.0ను రూపొందించారన్నారు. ఇప్పటి వరకూ ప్రాణరక్షక మందులపై ఉన్న 12 శాతం పన్నును జిఎస్‌టి 2.0లో పూర్తిగా ఎత్తివేశారన్నారు. సాధారణ మందులు, టెస్టింగ్ కిట్లపై పన్నును 5శాతానికి పరిమితం చేశారన్నారు. వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్లు, గ్లూకోమీటర్లు, థర్మామీటర్లు, కోవిడ్ మరియు డెంగీ టెస్టింగ్ కిట్లపై పన్ను తగ్గడంతో ఆస్పత్రుల చికిత్సా ఖర్చులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ఆరోగ్య, కుటుంబ బీమాలపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయడంతో ప్రజలకు 18శాతం వరకు నేరుగా ఆదా లభిస్తుందని చెప్పారు. ఉదాహరణకు రూ.10వేలు ప్రీమియం ఉన్న పాలసీపై గతంలో రూ.11,800 చెల్లించాల్సి వచ్చేది, ఇప్పుడు రూ.10వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. జిమ్‌లు, ఫిట్నెస్ సెంటర్లు, కంటి పరీక్షలు, ఆయుష్ మందులు, హోమియోపతి, యునానీ, యోగా కేంద్రాలపై కూడా పన్ను రేట్లు గణనీయంగా తగ్గించారన్నారు. ఈ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నామని ఆయన తెలిపారు. ప్రజలు కూడా ఆమేరకు ప్రయోజనం చేకూరుతుందో లేదో చూసుకోవాలని కోరారు. జిఎస్‌టి 2.0కు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు, సాంకేతిక సమస్యలు లేదా సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 1800-1200-232ను సంప్రదించొచ్చన్నారు. బిల్లుల్లో జిఎస్‌టి తగింపు అమలు కాకుంటే 1915 వినియోగదారుల హెల్ప్‌లైన్ ద్వారా కూడా సమాచారం అందించొచ్చనఅనరు. ఫిర్యాదులు స్వీకరణ కు తూర్పు గోదావరి జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 91 87126 31290 ఏర్పాటు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

కళాశాలలో సౌకర్యాల మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు సౌకర్యాలు మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేసిందన్నారు. జూనియర్ కళాశాల అభివృద్ధికి మధు అనే దాత రూ.5లక్షలు విరాళం అందించారన్నారు. ఈ నిధులతో కళాశాలలో అవసరమైన పనులు చేయిస్తున్నామన్నారు. దాతల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విద్యావ్యవస్థ ప్రక్షాళన చేస్తున్నారన్నారు. చాగల్లు, వేగేశ్వరపురం, కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, కొప్పాక విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సైబర్ నేలరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవి.సురేష్, పి.దుర్గాప్రసాద్ తెలిపారు. నగరంలోని జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు, విజయ దుర్గా జూనియర్ కాలేజ్ విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, తక్కువ ఇన్వెస్ట్మెంట్ తో ఎక్కువ డబ్బులు వస్తాయని, సులువుగా డబ్బులు సంపాదించాలని అత్యాశకు పోయి, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో అపరిచితులతో చాటింగ్ చేయరాదన్నారు. అనవసర లింక్‌లను, అప్లికేషన్లు క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలు గురించి వివరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

'దీక్షారంభం'లో చిరంజీవులు గెస్ట్‌లెక్చర్

రాజమహేంద్రవరం : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం బిఎస్‌సి, ఎంఎల్‌సి మొదటి సంవత్సర విద్యార్థులకు బుధవారం నిర్వహించిన 'దీక్షారంభం' కార్యక్రమంలో భాగంగా ఒఎన్‌జిసి ఛీఫ్ మేనేజర్ డాక్టర్ చిరంజీవులు అతిథి ఉపన్యాసం ఇచ్చారు. పారిశ్రామిక రంగంలో అవకాశాలు, ఇంటర్వ్యూలో మెళకువలు, పారిశ్రామిక రంగంలో ఎదుగుదలకు అవసరమైన అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థల్లో ఉన్న అవకాశాల గురించి విపులంగా వివరించారు. నీటి విశ్లేషణ, హెచ్‌పిఎల్‌సి, వివిధ ఖనిజాల విశ్లేషణ గూర్చి ఉపన్యసించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, అధ్యాపకులు హాజరయ్యారు.

బాణసంచా విక్రయదారుడు అరెస్ట్

నల్లజర్ల : దూబచర్లలో అక్రమంగా బాణసంచాను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.40 వేల విలువ చేసే బాణసంచా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు యలమటి ఉదయభాస్కర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

10 నుంచి అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల బాక్సింగ్, ఉషో ఛాంపియన్షిప్ పోటీలు ఈ నెల 10 నుంచి 15 వరకూ జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మలోవలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. బాక్సింగ్ అండర్-14 బాలురు. అండర్ 17 బాలురు, బాలికలు, అండర్-19 బాలురు, బాలికలు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 13 జిల్లాల నుంచి సుమారు 1,650 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారని ఎస్‌జిఎఫ్ సెక్రటరీ ఎవిడి.ప్రసాదరావు తెలిపారు.

ట్రైనింగ్ ఎస్‌ఐగా జయరాజు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు ట్రైనీ ఎస్‌ఐగా బెల్లంకొండ జయరాజు నియమితులయ్యారు. నెల రోజుల పాటు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా శిక్షణ పొందు తారని రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. నెల రోజుల పాటు పోలీస్ విధులకు సంబంధించి వివిధ అంశాలపై శిక్షణ తీసుకుంటారని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలులోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిడదవోలు మండల స్థాయి అండర్ 14 - 17 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలను బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ఎంఇఒ కెఎన్‌వి.గణేష్ కుమార్ అధ్యక్షతన కబడ్డీ, వాలీబాల్, చదరంగం పోటీలకు ఎంపికలు నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుండి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి వారిని డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బండి ప్రదీప్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, నిడదవోలు పట్టణ జనసేన అధ్యక్షులు రంగా రమేష్, రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి-2 పి. గురుమూర్తి, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బాణసంచా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

బుధవారం అక్రమ బాణసంచా నిల్వలపై సీతానగరం ఎస్‌ఐ రామ్ కుమార్ ఆధ్వర్యంలో ట్రైనీ ఎస్‌ఐ బి.సురేష్‌దాడులు నిర్వహించారు. రామచంద్రపురం గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 50 తారాజువ్వలు, 190 అవుట్ బాంబులును పిజ్జారి వెంకట సూర్య ప్రకాశవు వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రఘుదేవపురం గ్రామంలో 5 కేజీల బాణసంచా ముడి పదార్థాలను మండపల్లి జైబాబు నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ రామ్‌కుమార్ తెలిపారు.

సిజెఐపై దాడికి నిరసన

ప్రజాశక్తి - చాగల్లు

సిజెఐపై దాడిని ఖండిస్తూ బిఎస్‌పి ఆధ్వర్యంలో బుధవారం చాగల్లులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. సనాతన ధర్మం పేరిట జరుపుతున్న దాడిలో భాగంగానే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగిందన్నారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలో భాగమేనన్నారు. సనాతన ధర్మం పేరిట దళితుల మీద దాడులు చేస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షులు వారా రాజు, బయ్యే మునీంద్ర, బహుజన రచయితల వేదిక కవి నేలపూరి రత్నాజీ, తాడేపల్లి రాజన్‌బాబు, అంబటి పుల్లారావు న్యాయవాది కర్ణ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - కొవ్వూరు

దీపావళి పండుగ నేపథ్యంలో లైసెన్స్ లేకుండా బాణ సంచాను విక్రయిస్తే చర్యలు తప్పవని సిఐ పి.విశ్వం హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బాణసంచా విక్రయాలు చేస్తున్న దుకాణాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనుమతులు లేకుండా అక్రమ నిల్వలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ బాణా సంచా తయారీ లేదా నిల్వ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. 112కు లేదా 9440796622 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. మైనర్లను తయారీ, విక్రయ కేంద్రాల్లో పనిలో పెట్టుకోకూడదన్నారు.

హౌసింగ్ పథకం పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ పథకం పురోగతిపై హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.బుజ్జి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అమలు తీరు, నిర్మాణాల పురోగతిపై అధికారులతో చర్చించారు. అనంతరం పీడీ సిమెంట్ గోడౌన్‌ను సందర్శించారు. అక్కడ నిల్వ ఉన్న సిమెంట్ నాణ్యత, సరఫరా తీరుతెన్నులను పరిశీలించారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాజ్‌కుమార్, డిఇ రామారావు, డిప్యూటీ ఎంపిడిఒ మూర్తి, ఎఇ సుబ్రహ్మణ్యం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 315 మంది ఎంపిక

నల్లజర్ల : గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో నల్లజర్ల జడ్‌పి ఉన్నత పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 315 మంది ఎంపికయ్యారని మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ యుద్ధనపూడి బ్రహ్మరాజు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో 1,800 మంది నిరుద్యోగులు హాజరు కాగా సుమారు 30 ప్రైవేట్ కంపెనీల వారు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు, టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ. సొసైటీ అధ్యక్షులు రావూరి వెంకటరమణ. టిడిపి ద్వారకాతిరుమల మండల అధ్యక్షులు లంకా సత్యనారాయణ. గోపాలపురం మండల అధ్యక్షులు కొర్లపాటి రాము, దేవరపల్లి మండల అధ్యక్షులు ఆంద్రు అనిల్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



నినదిస్తున్న ఎపిఎన్‌జిఒలు

రాజమహేంద్రవరం రూరల్ : ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాలకు అడహక్ కమిటీలు ఏర్పాటు నిమిత్తం ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమణ బుధవారం రాజమహేంద్రవరం విచ్చేశారు. వారికి స్వాగతం పలికేందుకు ధవళేశ్వరం యూనిట్ నుంచి ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.జయకుమార్ ఆధ్వర్యంలో బైకులపై ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆనం రోటరీహాల్లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్ : ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద బుధవారం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ టి.గణేష్ హాజరై వద్దులకు సీనియర్ సిటిజన్ కార్డ్స్, దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో వృద్ధులకు సేవ చేస్తున్న పోసి కుమార్, సత్య దంపతులను అభినందించారు. తల్లిదండ్రుల పట్ల పిల్లల ప్రవర్తన సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కెవిఆర్ సాగర్,బసన బోయిన. దుర్గ ,వద్ధులు దివ్యాంగులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

వేరే వేరే ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారని తుని రైల్వేస్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారుత. బుధవారం గుడ్డుచర్ల రైల్వే లైన్ పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. అలాగే కొత్తూరు గ్రామ సమీపంలో 45 నుంచి 50 సంవత్సరాలు వయసున్న గుర్తు తెలియని మృతదేహం రైల్లే లైన్ వద్ద పడి ఉండగా గుర్తించినట్లు తెలిపారు. బయ్యవరం, కసింకోట రైల్వే స్టేషన్ మధ్యలో 23 సంవత్సరాల వయసుగల యువకుడు చెన్నై నుంచి హౌరా మెయిల్ ట్రెన్‌లో ప్రయాణం చేస్తూ జారిపడి మృతి చెందాడని తెలిపారు. అతని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. మూడు మృతదేహాలను తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

బాలిక మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని దమ్మెన్ను కాలువలోకి దూకిన బాలిక మృతదేహం మోర్త సరిహద్దు ప్రాంతంలో బుధవారం లభ్యమైంది. ఉండ్రాజవరం ఎస్ఐ డి.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక మంగళవారం యథావిధిగా కళాశాలకు వెళ్లింది. బస్సులో తిరిగి ఇంటికి బయలుదేరింది. దారిలో బస్ దిగి, పక్కనే ఉన్న కాలువలోకి దూకేసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ డి.రవికుమార్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చేపట్టారు. బుధవారం సాయంత్రం బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నిల్వ ఉంచిన బాణసంచా సీజ్

ప్రజాశక్తి - గోకవరం

పోలీసులు దాడులు చేసి రెండు చోట్ల అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని సీజ్ చేశారు. ఎస్పి ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ పర్యవేక్షణలో కోరుకొండ సిఐ సత్యకిషోర్ ఆదేశాల మేరకు, గోకవరం ఎస్ఐ పవన్ కుమార్, ట్రైనీ ఎస్ఐ నాగమణి ఆధ్వర్యంలో గోకవరం, కొత్తపల్లిలో రెండు చోట్ల బుధవారం దాడులు నిర్వహించారు. రూ.40వేలు విలువ చేసే అక్రమంగా నిల్వ ఉంచిన బాణ సంచాను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కొత్తపేటలో...

అక్రమంగా నిల్వచేసిన బాణసంచాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆర్ఎస్.నగర్ లో బాణసంచా సామగ్రి నిలవచేశారన్న సమాచారం మేరకు రావులపాలెం సిఐ సిహెచ్.విద్యాసాగర్ తో కలిసి దాడి చేశామన్నారు. యర్రం శెట్టి మురళీకష్ణ ఇంటి పక్కన నిలువ చేసిన రూ.1,04,730 విలువ కలిగిన 203 కేజీల గంధకం, పొటాషియం, బొగ్గు పొడి, క్లోరైడ్, వంటి సంబంధిత సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పశువుల కంటైనర్ సీజ్

ప్రజాశక్తి - కొవ్వూరు

ఎలాంటి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీని మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ పి.విజయకుమార్ తెలిపారు. పట్టణంలో గ్రామం ఇండియా టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అందిన సమాచారంతో కంటైనర్ లారీని తనిఖీ చేయగా దానిలో 32 పశువులను తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. పార్వతీపురం నుంచి సూళ్లూరు పేటకు వీటిని తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. డ్రైవర్ నక్క వెంకట్రావు తో పాటు అతని సహాయకుడు గాది అంజిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులు ఇరువురు గండేపల్లి మండలం నీలాద్రిరావు పేట గ్రామానికి చెందిన వారన్నారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను సామర్లకోట సమీపంలోని వి.వేమవరం గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

గాయపడిన తాపీ మేస్త్రి మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడిన మండలంలో దొమ్మేరు గ్రామానికి చెందిన నీరుకొండ సుబ్బారావు అనే తాపీ మేస్త్రి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడనిపట్టణ హెడ్ కానిస్టేబుల్ మోటూరి సత్యనారాయణ తెలిపారు. గత నెల 22న సుబ్బారావు దొమ్మేరు సావరంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పై అంతస్తు నుంచి జారి పడ్డాడు. అప్పటి నుంచి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

మ్యూజియంను వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మ్యూజియంను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని పలువురు వైసిపి కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కోరారు. బుధవారం వారు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా కౌన్సిలర్లు మాట్లాడుతూ మ్యూజియంను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలు సందర్శనార్థం అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవరావు, వాసంశెట్టి గంగ, రఫీ, నాయకులు చింత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నో స్మోకింగ్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెం సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు పొగాకు వినియోగం వల్ల జరిగే అనర్థాల పట్ల బుధవారం అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాథర్ సజీథామస్ మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల అనారోగ్యానికి గురి అవడమే కాకుండా క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ ఎలిసీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ప్రీస్కూల్ తప్పనిసరి

ప్రజాశక్తి - సామర్లకోట



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ లక్ష్మీ

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ కార్యకలాపాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఐసిడిఎస్ పీడీ సిహెచ్. లక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం జరిగింది. సిడిపిఒ జీవస అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ-స్కూల్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వ హించాలన్నారు. అంగన్‌వాడీలకు సంబంధిం చిన డేటాను సమయానికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 16వ తేదీ నుంచి పోషణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వమించారు. పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు ఉష, పూర్ణిమ, వై.లక్ష్మి, ఎ. జ్యోతి, వెంకటలక్ష్మి, పద్మావతి, శ్రీలత, దుర్గాదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.

వికలాంగునికి ఛార్జింగ్ ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి-గోకవరం


ట్రైసైకిల్ అందిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

గోకవరం గ్రామానికి చెందిన వికలాంగుడు పోసిన వెంకటరమణకు ఛార్జింగ్ ట్రై సైకిల్‌న జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే నియోజకవర్గం లోని వికలాంగులకు హాలీంకో సంస్థ ద్వారా ఉపకరణాలు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. పింఛను పెంచి ఆర్థికంగా ఆదుకుందన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ, సబ్సిడీ రుణాలు అందిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడప భరత్ బాబు, జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, భూపాలపట్నం ప్రసాద్, తెలుగుయువత మండల యువత అధ్యక్షులు పల్లేల బాబి, నాయకులు పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రయివేటీకరణ దారుణం

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటీకరణ చేయడం దారుణమని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన వైసిపి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య విద్యను పేద విద్యార్థులకు దక్కకుండా చేసేందుకే కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రయివేటీకరణకు పూనుకుంటుందని విమర్శంచారు. తక్షణమే పిపిపి విధానాన్ని రద్దు చేయాలని ఆయన కూటమి ప్రభత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమం పేరుతో ప్రజలను కూటమి ప్రభుత్వం దోచుకుంటుందని విమర్శంచారు. కుటీర పరిశ్రమగా చీప్ లిక్కర్ తయారవుతుందన్నారు. మద్యం విక్రయాల వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట రాంజీ, చలగల దొరబాబు, రామకుర్తి మూర్తి, మద్దిపట్ల రామకష్ణ, రావుల రాజా, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్ఎ జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి

జగ్గంపేట మండలంలోని పలువురు కుటుంబాలను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం పరామర్శించారు. రామవరం గ్రామా నికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు తండ్రి అడబాల ముసలయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆయన పరామర్శించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జగ్గంపేటకు చెందిన ప్రముఖ వైద్యులు గోలి శ్రీరాములు భార్య వరహాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గండేపల్లికి చెందిన జర్నలిస్టు అడపా వెంకట్రావు అనారోగ్యంతో ఉండటంతో ఆయనను ఎంఎల్ఎ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్. అప్పలరాజు, అడపా భరత్, జీను మణిబాబు, అనుకూల శ్రీకాంత్, పాండ్రంగి రాంబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, సర్వసిద్ధి లక్ష్మణరావు, కేబుల్ ఆపరేటర్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండారు కృష్ణమూర్తి, సామర్లకోట ఫైబర్ నెట్ ఎండి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

చదరంగం పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - నిడదవోలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ సంవత్సరం నిర్వహిస్తున్న 69వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిడదవోలు మండల స్థాయిలో నిర్వహించిన చదరంగం అండర్ -4 బాలుర విభాగంలో నారాయణ పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి కుంచాల స్థితప్రజ్ఞ తపస్వి రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. నిడదవోలు నియోజకవర్గ స్థాయిలో జరిగే చదరంగం పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎస్‌జిఎఫ్ నిర్వాహకులు, హెచ్‌ఎం, అభినందించారు.

బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కరప, పెద్దాపురం

కరప పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాల్లో సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, ఎస్ఐ టి.సునీత తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల యాజమాన్యులకు పలు సూచనలు చేశారు. భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సిఐ సూచించారు. పెద్దాపురం పట్టణంలోని పలు బాణసంచా తయారీ కేంద్రాలను సిఐ విజయశంకర్, తహశీల్దార్ వెంకటలక్ష్మి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మండల టిడిపి అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు అన్నారు. బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను, కూటమి నాయకులు కరోతు గాంధీ, జొన్నాడ వీరబాబు, షేక్ ఇమ్రాన్, ఎంపిడిఒ సిహెచ్.రవికుమార్‌వర్మ, ఎంఇఒ బి.అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జెడ్ రాగంపేట పిహెచ్‌సి వద్ద రోగులతోపాటు, వారి సహాయకులకు భోజనం పంపిణీ కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతుల నవీన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పిహెచ్‌సికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందుకు అవసరమైన భోజనశాల భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. త్వరలోనే అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, భూపాలపట్నం ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రణీత్, రాయి సాయి, నలమాటి ఆనంద్, తోట అనిల్ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో ముందుకు : గోరంట్ల

ప్రజాశక్తి-కడియం

విద్యాశాఖలో పెను మార్పులు చేసి, నూతన విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం కడియం, కడియపు సావరం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కడియం హైస్కూల్లో రూ.23 లక్షల పిఎంఎస్‌హెచ్‌ఆర్ఐ నిధులతో నూతనంగా నిర్మించే సైన్స్ బ్లాక్‌కు శంకుస్థాపన చేశారు. కడియపుసావరంలో మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో నిర్మించే డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ తన సొంత నిధులు రూ.2లక్షలతో నిర్మిచిన షెడ్డును ప్రారంభించారు. అలాగే రూ.7లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కడియంలో జూనియర్ కాలేజీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కడియపుసావరం ప్రధాన రహదారి నిర్మాణం నిమిత్తం రూ.2.5 కోట్లు మంజూరు చేశామన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు మొదలు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మోసిగంటి సత్యవతి, చెక్కపల్లి మురళీకృష్ణ, ఎంపిటిసి సాపిరెడ్డి వీరదుర్గ, ఎపిఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, నాయకులు వెలుగుబంటి నాని, అన్నందేవుల చంటి పాల్గొన్నారు.

'ప్రశాంత్‌పై విమర్శలు తగవు'

ప్రజాశక్తి - పెరవలి

జనసేన నేత, మంత్రి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రశాంత్‌కు వ్యతిరేకంగా కొన్ని టీవీల్లో వచ్చిన లేనిపోని విమర్శలు తగవని జనసేన మండల అధ్యక్షులు పిప్పర రవికుమార్, నాయకులు ఖండించారు. స్థానిక దీపిక ఎసి ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కందుల దుర్గేష్‌పై విమర్శలు చేయడానికి ఏమీ లేక ప్రశాంత్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. కొంత మంది కుట్రపూరితంగానే ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు టి.చినబాబు, చక్రవర్తి, రేలంగి రాజేష్, సంగీత నాగు, కోలా సీతయ్య నాయుడు, సిహెచ్.మూర్తి, పి.శ్రీను, తారక రామారావు, ఎ.శక్తిబాబు, దేవా పవన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి- గోపాలపురం

గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ బుధవారం నిర్వహించారు. అండర్ -14, 17 విభాగాల్లో పోటీలు జరిగాయి. కోకో, కబడ్డీ, వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని పలు పాఠశాలల నుంచి బాలురు, బాలికలు సుమారు 150 మంది పోటీలలో పాల్గొనట్లు తెలిపారు. డివిజన్ స్థాయి పోటీలకు 130 మంది ఎంపికయ్యారన్నారు. ఈ పోటీలు డివిజన్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వెంకటపద్మ, జగన్నాథపురం పీడీ, మండల కోఆర్డినేటర్ గద్దె చంద్రశేఖర్, సీతారాముడు, రమేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.